
# గోవిందా...గోవింద



"ఏమండీ, స్కూలుకేనా పోతున్నారు?" ఇంటి ముందు వీధి అరుగు మీద కూర్చుని, అదే బజారులో వున్న స్కూలుకి వెళ్తున్న రాంబాయమ్మ టీచర్‌ని అడిగాడు గోవిందరావు.

"అవున్నాయనా, స్కూల్‌కే వెళుతున్నాను. వాన అయినా, వరద అయినా, ఎండ అయినా, గాలయినా వెళ్ళి, అక్కడ కూర్చుని హాజరు వేసుకుని రాక తప్పదుగా!" అంది ఆమె భారంగా నిట్టూరుస్తూ ఎవరో పెద్ద కొండరాయిని బలవంతంగా తన నెత్తిమీదకు తీసుకువచ్చి పెడితే, ఆ రాయిని మోస్తున్నంత బరువుగా, బాధగా, అసహనంగా.

"ఏం పుస్తకమండీ అది?" ఆమె చేతిలోని పుస్తకం వైపు చూస్తూ అడిగాడు.




కథా నిలయం
శ్రీకాకుళం

# మొలకపల్లి కోటేశ్వరరావు

"ఇదా? ఏదో నవల. అద్దె పుస్తకాల షాపు నించి తెచ్చుకుంటున్నాను. పూరికే చేతులు గిల్లుకుంటూ కూర్చోవడం ఎందుకని ఇది తీసుకుపోతున్నాను. బళ్ళో టైం పాస్ కావాలి కదా?"

"ఈ వారం వీక్లీ వుంది నా దగ్గిర, చూస్తారా?" అన్నాడు గోవిందరావు మనసులో వుత్సాహపడిపోతూ, పైకి ఏదో అతి సాధారణంగా అడుగుతున్నట్లుగా ఫోజు పెట్టి.

"ఇవ్వు మరి చూస్తా!"

ఆమెకి పుస్తకాలంటే చాలా ఇష్టం. ఆ పల్లెటూళ్లోనేమో పుస్తకాలు దొరకవు. సోడాలు, కిళ్ళీలూ అమ్మే ఒక చిన్న వ్యాపారి ఒక వంద నవలలు సెకెండ్ హేండ్‌వి కొనుక్కు వచ్చి అద్దెలకి తిప్పుతున్నాడు. ఆ పుస్తకాలు చదివే వాళ్ళు తక్కువ.

మొత్తం మీద ఆ వూళ్ళో అలాంటి పుస్తకాలు చదివేవాళ్ళు ఇరవై మంది, పాతిక మంది వుంటారేమో! అసలు ఆ వూళ్ళో చదువుకున్న వాళ్ళే తక్కువ! ఆ వానా కాలం చదువులు వెలగబెట్టిన వాళ్ళకి కూడా వాళ్ళ పనులతోనే సరిపోతుంది.


తీరుబడిగా కూర్చుని పుస్తకాలు చదివే వెసులుబాటు ఎవరికి వుంటుంది, పొలం వుండి పనీ పాటా లేకుండా వూరికే ఖాళీగా తిరిగే సోమరిపోతులకి తప్ప! అలాంటి వాళ్ళు తక్కువే! వెనుక తాతలూ, ముత్తాతలూ సంపాయించిన ఆస్తులు వున్న ఆ అమాంబాపతు సోమరిపోతులకి కూడా ఇప్పుడు చదివే ఆ కాస్త అలవాటు కూడా మరిచిపోవడానికి వీలుగా, నడి ఇంట్లో ఎలక్ట్రానిక్ మీడియా వచ్చి కూర్చుందాయె!

ఇప్పుడు అలాంటి వాళ్ళు టి.వి.లు ముందు చతికిలబడిపోతున్నారు. అక్కడ మైండ్ బొత్తిగా పని చేయకపోయినా, కళ్ళకి మాత్రం క్షణం తీరికలేనంత పని! కళ్ళప్పగించి చూడటమేనాయె అనుక్షణమూ!

బడిలోనికి టి.వి. తీసుకుపోయే వీలు లేదు కాబట్టి రాంబాయమ్మ టీచరే ఆ అద్దె పుస్తకాలకి గట్టి కస్టమర్ అయింది. ఆమె ఒకటికి రెండు సార్లు అవి చదివింది. ఇప్పుడు మూడో వరస మొదలుపెట్టింది.

ఆమె ఎప్పుడైనా టౌనుకి వెళ్తే ఒకటీ రెండు మ్యాగజైన్లు కొనుక్కు వస్తుంది. అవి స్కూలుకి తీసుకుపోతూ వుంటే, గోవిందరావు అవి తీసుకుని చదివి, తిరిగి ఇస్తుంటాడు.

గోవిందరావు ఇంట్లోకి వెళ్ళి వీక్లీని తీసుకువచ్చి ఆమెకి ఇచ్చాడు. "ఇందులో నేను రచించిన కథ వుందండీ!"




"నువ్వు కథ రచించావా?" అని ఆశ్చర్యంగా, ఆనందంగా ఆమె అంటుందనుకున్నాడు కానీ, అలాంటి ప్రతిస్పందన ఏదీ ఆమె నుంచి రాకపోవడంతో గోవిందరావు కాస్తంత నిరాశపడిపోయాడు.

"ఆ కథ చదివి మీ అభిప్రాయం చెప్పండి!" అన్నాడు, కనీసం ఇప్పడైనా తన కథ విషయమై ఏమైనా స్పందిస్తుందేమోనని ఆశగా.

"అలాగే బాబూ!" యాంత్రికంగా అని ఆమె ఆ వీక్లీని తీసుకుని స్కూలుకి వెళ్ళిపోయింది.

ఇక స్కూలు ఎప్పుడు వదులుతారా, రాంబాయమ్మ ఎప్పుడు వస్తుందా, తన కథ మీద ఆవిడ అభిప్రాయం ఏమి చెవుతుందా అని గోవిందరావు ఎదురు చూడసాగాడు. నిమిష నిమిషానికీ వాచీ చూసుకుంటున్నాడు. ఇంట్లోకీ, బయటకీ అదే పనిగా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. మేత కోసం గేదె మోర ఎత్తి చూసినట్లు పాఠశాల వైపు మోర ఎత్తి చూస్తున్నాడు. ఒక్క క్షణం ఒక చోట ప్రశాంతంగా కూర్చోబుద్ధి కావడం లేదు.

మధ్యాహ్నానికి ముగ్గురు పిల్లలు గాడిదల్లా సంచులు భుజానికి వేలాడేసుకుని, పాపం ఆపసోపాలు పడుతూ అవి మోస్తూ ఇంటికి పోతున్నారు.

మరో ముగ్గురు చిన్న పిల్లలు నిక్కర్లు లేకుండా, చొక్కాలకు బటన్స్ లేకుండా బోడి పలకలు తీసుకుని చీమిడి కారుతూ, దుమ్ము కొట్టుకుపోయి, కాలుష్యంతో నిండిపోయిన కార్ఖానాల్లో పని చేసే కార్మికుల అవతారాలకి మల్లే మురికితో, ఎగురుకుంటూ ఇంటికి పోతున్నారు.

"హమ్మయ్య, బడి వదిలిపెట్టారన్నమాట!" అని వూపిరి పీల్చుకున్నాడు గోవిందరావు.

ఆ ప్రాథమిక పాఠశాలలో నలుగురు వుపాధ్యాయులు వుంటే, ఎనిమిది మంది విద్యార్థులు వున్నారు. ఇద్దరు విద్యార్థులకు ఒక వుపాధ్యాయుడన్నమాట! అంత ఆదర్శవంతమైన పాఠశాల అది.

దేశంలో 99 శాతం పాఠశాలల్లో సరిపడా వుపాధ్యాయులు వుండరు. అయితే ఆ పాఠశాల అందుకు పూర్తి భిన్నం! అక్కడ సరిపడా విద్యార్థులు లేరు. ఉన్న ఆ 8 మంది విద్యార్థులు కూడా ప్రతీ రోజూ స్కూలుకి వెళ్ళరు. ఒక రోజుకి స్కూలుకి వెళ్తే రెండు రోజులు కూలి పనికో, గేదెలు మేపడానికో, గాడిదలు కాయడానికో వెళ్ళి బడికి ఎగనామం పెడతారు.

ఉన్న నలుగురు వుపాధ్యాయులు మాత్రం టంచన్‌గా ప్రతి రోజూ స్కూల్‌కి హాజరు కావాల్సిందే! అందుకు స్థానిక కారణాలతో పాటు, ఇతర కారణాలు కూడా చాలా వున్నాయనుకోండి.

ఆ రోజు కూడా ఆ వుపాధ్యాయులు పాఠశాలకి వచ్చారు. యథావిధిగానే ఆ వూరి దగ్గర మొదలుపెట్టి, ఢిల్లీ రాజకీయాల వరకూ ఆమూలాగ్రం సమగ్రంగా, అవిశ్రాంతంగా చర్చించారు. వాదించుకున్నారు. ప్రతి రోజూ వాళ్ళ కార్యక్రమం, డ్యూటీ అదే! చివరికి టైం అయిపోవడంతో గంట కొట్టి బడి వదిలి ఎవరి దారిన వాళ్ళు ఇళ్ళదారి పట్టారు.

రాంబాయమ్మ కోసం ఎదురు చూస్తున్న గోవిందరావు ఆమె వీధి మొదట్లో కనబడటంతో, టక్కున ఇంట్లోకి వెళ్ళి, ఆమె వాళ్ళ ఇంటి ముందుకి వచ్చే సమయానికి అప్పుడే ఇంట్లో నించి వస్తున్నట్టు బయటకు వచ్చాడు.

ఆమె తల వంచుకుని నెమ్మదిగా వెళ్తోంది.

"ఏమండీ, ఆ జంతర్ మంతర్ వీక్లీ చదివారా? అందులో నా క..."

"ఎక్కడ బాబూ? ఈ వేళ పిల్లలకి పాఠాలు చెప్పడంతోనే సరిపోయింది. స్కూల్‌కి చాలా మంది పిల్లలు వచ్చారు ఇవ్వాళ" అంది.

పాపం, ఆమె తరగతికి ఇద్దరు పిల్లలు వస్తేనే చాలా మంది పిల్లలు వచ్చినట్లు ఆమె భావించింది. టీచర్లందరిమీ కబుర్లు చెప్పకుంటూ కూర్చున్నామంటే బాగుండదనే వుద్దేశంతో, పాఠాలు చెప్పామని అన్నం వున్నాం, ఆ ఆలు ఏమీ ఎరుగని ఆ బాలల మీద పెద్ద అభాండం వేసింది.

"అసలు వీక్లీనే తిరగెయ్యలేదా?"

"లేదు బాబూ, కదుర్లేదు"

గోవిందరావు ఒక్క క్షణం నిరాశపడిపోయాడు. ఉదయం నుంచీ ఎదురు చూసిన ఉత్సాహం అంతా నీరు గారిపోయింది. ఆ నిరాశతోనే గోవిందరావుకి తిక్కరేగింది.

తాను ఎంతో కష్టపడి రాసిన కథని, ఎంతో ఇష్టపడి ఆమెకి చదవమని ఇస్తే, అది చదవడానికీ, పోనీ చూడటానికి కూడా కుదర్లేదట!

ఏమిటీ ఆమెతో తనకి ముఖమాటం, బోడి ముఖమాటం!

"సర్లెండి, ఆ వీక్లీ ఇవ్వండి. అంతగా మీరు చదవదలుచుకుంటే రేపు తీసుకుందరు"

"ఎంత సేపు, ఒక్క గంట చదివితే అయిపోతుంది. చదివి పిల్లలతో మీ ఇంటికి పంపిస్తాను"

"కుదరదు. తరువాతే చదువుదురు. కావాలంటే రేపిస్తాను. ఇప్పుడు ఆ వీక్లీతో పని వుంది."

రాంబాయమ్మ మారుమాట్లాడకుండా వీక్లీ ఇచ్చింది.

అది ఇంట్లోకి తీసుకుపోయి తను రాసిన కథ మళ్ళీ మరోసారి చదువుకున్నాడు. మూడోసారి చదువుకున్నాడు. అచ్చయిన తన పేరు ఒకటికి నాలుగు సార్లు చదువుకున్నాడు.

కథకి వేసిన బొమ్మ కూడా బాగుంది. తన పేరుని కూడా బొమ్మ వేసిన ఆర్టిస్టు గుండ్రంగా రాశాడు. అయితే ఇంకాస్త పెద్ద అక్షరాలతో రాస్తే బాగుండేది అనుకున్నాడు.

తను కథ రాశాడు. అచ్చయ్యింది. మనసుకి చాలా ఆనందం వేసింది. 'యాహూ' ఒక్కసారిగా పెద్దగా అరుద్దామనిపించింది!


ఏమిటో, అందరూ తనని పిచ్చోడు అంటారు. అరిస్తే తనని తీసుకుపోయి నిజంగానే పిచ్చాసుపత్రిలో పడేస్తారేమో!

హైదరాబాదులో తన మేనమామ వున్నాడు. ఆయన యూనివర్సిటీలో రీడరు. పుస్తకాలు చదువుతుంటాడు.

ఆయన కూడా తన కథ చూసి వుంటాడు. చూసి సంతోషంగా చదివి వుంటాడు. తన మేనల్లుడు కథ రాసాడని ఇంట్లో కూడా అందరికీ చెప్పే వుంటాడు.

అత్తయ్య కూడ తన కథ చదువుతుంది కాబోలు! ఆమెకి తాము అంటే ఎంతో చిన్న చూపు!

ఆ మామయ్య కూతురు ఎంఎస్సీ మైక్రోబయాలజీ చదువుతోంది. ఏమనుకొని వుంటుందో తనని గురించి!
తను నాలుగేళ్ళ క్రితం ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయ్యాడు.
ఒక్క సబ్జెక్ట్‌లో కాదు, నాలుగు సబ్జెక్ట్స్‌లో పోయింది. ఇక జన్మలో దానిని పూర్తి చేయలేడు తను.
హాయిగా తను కూడా చదువుకుని ఏ లెక్చరరో, రీడరో అయితే మామయ్య వాళ్ళ కూతుర్ని తనకి ఇచ్చి వుండేవాడు కాబోలు!
ఛ....ఇవ్వడం ఏమిటి? ఏమైనా వస్తువా?
తనకీ, ఆ అమ్మాయికీ వివాహం చేసి వుండేవాడు! ఆయనకి తాను అంటే ఎంతో ఇష్టం!
అయితే అత్తయ్యకి తను పొడగిట్టదు. ఆమెకి వాళ్ళ పుట్టింటి వాళ్ళు అంటేనే అభిమానం.
తను కనీసం రచయితగానైనా పేరు ప్రతిష్ఠలు తెచ్చుకోవాలి. అందరూ తన వునికి గుర్తించాలి. నలుగురిలో గుర్తింపు పొందాలి.
తాను పెద్ద రచయిత అయితే బంధువర్గం కూడా తనని గురించి ఘనంగా, గొప్పగా చెప్పుకుంటుంది!
మనసు ఆనందంలో తేలిపోతోంది.
వీక్లీ పట్టుకొని ఇంట్లోనించి మళ్ళీ బయటకు వచ్చాడు.
అప్పారావు సైకిల్ మీద పోతున్నాడు.
తన కంటే రెండు మూడేళ్ళు పెద్దగా వుంటాడు. అయినా తనని స్నేహంగానూ, హాస్యంగానూ 'బావా' అని పిలుస్తుంటాడు.
అతను కూడా అప్పుడప్పుడూ పుస్తకాలు తిరగేస్తుంటాడు.
"ఏం బావా, ఏం చేస్తున్నావ్?" సైకిల్ ఆపి, దిగి పలకరించాడు.
"ఏముంది చేయడానికి?"
"చేతిలో ఏం పుస్తకం అదీ?"
"ఇదా? జంతర్ మంతర్ వీక్లీ. ఇందులో నేను రాసిన కథ వుంది"
"అరె, నువ్వు కథ రాసావా?" ఆశ్చర్యంగా అడిగాడు.
"అవును"
"ఏదీ చూద్దాం, ఇటివ్వు" అని వీక్లీ తీసుకుని తిరగేసాడు.
"ఎంత ఇస్తారేమిటి ఈ కథకి?"
అందరూ వేసే ప్రశ్నే వేసాడు.
అన్నీ డబ్బుతో కొలవాల్సిందే!
రచన! అది ఒక కళ, ఆర్ట్ అని ఎవరూ ఎందుకు గుర్తించరు?
సమాజమే కుళ్ళిపోతోంది! అన్నీ డబ్బు విలువలే! అన్నీ డబ్బు సంబంధాలే! అన్నిటికీ డబ్బే ప్రధానం!
"ఎంత...వంద రూపాయిలు ఇస్తారు"
"ఏమిటీ, ఈ మూడు పేజీల కథకి వంద రూపాయిలు ఇస్తారా? నిజంగా ఇస్తారా?" మహా ఆశ్చర్యపడిపోతూ, నమ్మలేనట్లు విచిత్రంగా అడిగాడు.
"ఇస్తారు. అందులోనే రాసారు చూడు. ప్రచురించిన ప్రతి కథకీ వంద రూపాయిల పారితోషికం ఇస్తామని రాసారు"
"ఎన్ని రోజులు పట్టింది నీకు ఈ కథ రాయడానికి?"
"ఎన్నో రోజులూనా? ఒక్క గంట. అంతే!" తేలిగ్గా, బడాయిగా అన్నాడు.
"ఒక్క గంట! గంటకి వంద రూపాయిలా? అన్నిటికంటే ఇది మంచి వ్యాపారం మాదిరిగా వుందే చూడబోతే! నీడ పట్టున కూర్చుని రాసుకోవడం! మంచి సంపాదన!"
"ఏం సంపాదనలే?"
"ఈ సంపాదనకేం? రోజుకి పన్నెండు గంటలు రాస్తాం అనుకో! పోనీ, రెండు గంటలు తీసెయ్! రోజుకి పది గంటలు రాస్తే, గంటకి పది లెక్కన రోజుకి పది వందలు! వారానికి ఏడు వేలు! నెలకి 30 వేలు!





సంవత్సరానికి 3 లక్షలా 60 వేలు! మన సొంత పనికి ఆదివారాలు, సెలవలూ ఏముంటయిలే? ఏడాదికి ఇంత ఆదాయం వస్తుంటే, ఇంతకంటే మంచి ఆదాయం ఏ వ్యాపారంలో వుంది? నేనూ మంచిరోజు చూసుకుని రాయడం మొదలుపెడతా! నాకూ ఏ వ్యాపారం అచ్చిరావడం లేదు, కనీసం ఈ వ్యాపారం అయినా అచ్చివస్తుందేమో!" అన్నాడు అప్పారావు.
జనం సింపుల్‌గా అతనిని అప్పడూ అప్పడూ అని పిలుస్తుంటారు.
అతను అప్పడాల వ్యాపారం దగ్గర్నించీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం వరకూ, బజార్లంట బజ్జీలు అమ్మే వ్యాపారం దగ్గర్నించీ పెద్ద పెద్ద బంగళాలు కొనడానికీ, అమ్మడానికీ మధ్యవర్తిగా వుండే బ్రోకరేజీ వ్యాపారం వరకూ అప్పటికి 99 రకాల వ్యాపారాలు, వృత్తులూ చేసి, కొన్నిట్లో చేతులు కాల్చుకునీ, కొన్నిట్లో జనంతో తిట్లూ, చీవాట్లూ, దీవెనలూ తిని చివరికి నూరో వ్యాపారం ఏం చేయాలా అనే అన్వేషణలో వున్నాడు.
"అవునూ, ఇంతకీ పెట్టుబడి ఎంత కావాలి?"
"పెద్దగా పెట్టుబడితో పనేం వుంటుంది? కాగితాలూ, కలం, పోస్టేజి ఖర్చు!"
"అంతేనా? పోస్టేజితో కూడా కలుపుకుంటే రోజుకి 30, 40 రూపాయిలు అవుతుందేమో! పెద్దగా పెట్టుబడి కూడా ఏం అవసరం వుండదన్నమాట! నేనూ రేపో, ఎల్లుండో రాయడం మొదలుపెడతా!"
"అలాగే చెయ్!" గోవిందరావు ఏడవలేక నవ్వుతూ, నవ్వలేక ఏడుస్తూ అన్నాడు.
"మా ఇల్లు చూశావుగా? ఎండా వానా రెంటికీ అడ్డం లేదు. అవి రెండూ మా ఇంట్లోనే! పైగా ఇరుకిరుకు! ఆ చిన్న కొంపలోనే పది మంది బతకాలి. ఇంట్లో వుండాలంటేనే నాకు చిరాకు పుడుతోంది. ఎప్పుడెప్పుడు మంచి బిల్డింగ్ కట్టుకుందామా అని వుంది"
"తొందరగా కన్‌స్ట్రక్షన్ మొదలుపెట్టు"
"చేతిలో రూపాయంటే రూపాయ లేకపోయా! టీ తాగడానికి కూడా అర్ధ రూపాయి లేదు నా దగ్గిర! ఇక బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ ఏం మొదలుపెడతాను? ఇది పెట్టుబడి లేని మంచి వ్యాపారం! మొదటి ఏడాది సంపాదన పెట్టే మంచి బిల్డింగ్ కట్టుకుంటాను. వస్తాను బావా! చాలా మంచి సలహా చెప్పావు. నీ మేలు మాత్రం ఈ జన్మకి మరిచిపోను" అప్పడు ఆనందపడిపోతూ అన్నాడు.
"వస్తాను" మళ్ళీ చెప్పాడు. ఎగిరి సైకిల్ ఎక్కి ఉత్సాహంగా ఈల వేసుకుంటూ, బెల్లు కొడుతూ స్పీడుగా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.
ఆ రోజు నుంచీ గోవిందరావు జంతర్‌మంతర్ వీక్లీ వాళ్ళు వంద రూపాయిలు

ఎప్పుడు పంపిస్తారా అని ఎదురు చూడటం మొదలుపెట్టాడు.
రోజూ పోస్ట్‌మేన్ కోసం ఎదురు చూస్తున్నాడు. అతను కనపడగానే తనకి ఏమైనా వచ్చాయా అని అడుగుతున్నాడు. అప్పుడప్పుడూ పోస్టాఫీసుకి వెళ్ళి వస్తున్నాడు.
అలా దాదాపు రెండు నెలలు ఏ రోజుకారోజు డబ్బులు వస్తాయని ఎదురు చూశాడు. ఫలితం కనపడలేదు.
చివరకి ఒక రోజు ఎడిటర్‌కి వుత్తరం రాశాడు.
జంతర్‌మంతర్ వారపత్రిక ఎడిటర్ గారి దివ్యసముఖమునకు..
రచయిత గోవిందరావు చేసుకొను విన్నపం:
గౌరవనీయులైన అయ్యా..
ఫలానా తేదీ గల తమ జంతర్ మంతర్ వారపత్రికలో నేను వ్రాసిన కథను ప్రచురించినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నా మొదటి కథను ప్రచురించి నన్ను రచయితగా తెలుగు పాఠకులకు పరిచయం చేసినందుకు మీకు సర్వదా కృతజ్ఞుడిని.
మీరు నా కథను ప్రచురించి నాకు ఇచ్చిన ప్రోత్సాహంతో ముందు ముందు మరిన్ని కథలు రాసి గొప్ప రచయితను కాగలను.
ఒక చిన్న మనవి. నా కథకు మీరు పారితోషికం పంపించడం మరచిపోయినట్లున్నారు. పారితోషికం విషయం మీకు గుర్తు చేయడానికే నేను ఈ వుత్తరం రాస్తున్నాను. దయచేసి నా కథకు ఇవ్వవలసిన పారితోషికం డబ్బు వెంటనే పంపించవలసిందిగా మరీ మరీ ప్రార్థిస్తున్నాను.

ఇట్లు
తమ విధేయుడు
గోవిందవాసం గోవిందరావు
రచయిత
పమిడిపాడు

ఎడిటర్ గారికి వినమ్రంగా, ఎంతో భయభక్తులతో ప్రతిమాటలో విధేయతని వ్యక్తపరుస్తూ వుత్తరం రాశాడు.
నిజానికి గోవిందరావుకి ఆ ఎడిటర్ అంటే మనసులో ఏమీ గౌరవం లేదు.
తను ఆ కథని పంపించి 3 సంవత్సరాలా 8 నెలలు అయ్యింది.
అంటే 44 నెలలు అన్నమాట! ఈ 44 నెలల నుంచి నెలకి ఒక వుత్తరం చొప్పున ఎడిటర్‌కి రాస్తూనే వున్నాడు. ఎన్ని వుత్తరాలు రాసినా అవి అన్నీ నిష్ప్రయోజనమై పోయాయి. తన వుత్తరాలకి జవాబు వుండదూ, తన కథ విషయమూ తెలియచేయరు.




మొదట్లో ఎంతో ఆసక్తిగా, తన కథని ఎప్పుడెప్పుడు ప్రచురిస్తారా అని ఎదురు చూసిన గోవిందరావు పత్రిక వాళ్ళ నిర్లక్ష్య నిర్లిప్త ధోరణితో నెమ్మదినెమ్మదిగా ఆ కథ విషయం కూడా మరిచిపోయాడు. అలాంటి దశలో ఆ పత్రిక కాపీ ఒకటి వచ్చింది.
పత్రిక లోపల చూస్తే తన కథ!
మొట్టమొదటగా తన కథనీ, అచ్చులో తన పేరునీ చూసీ చూడటంతోనే గోవిందరావు ఎంతో ఉద్వేగానికీ, ఆనందానికీ లోనయ్యాడు. మధురానుభూతి చెందాడు.
పారితోషికం కోసం ఎదురు చూస్తున్న గోవిందరావు ఆ ఎడిటర్‌ని బాగా తిడుతూ వుత్తరం రాస్తే బాగుండేదనుకున్నాడు. అయితే ముందు ముందు తన కథలు ప్రచురించరు అనే ఆలోచనతోనూ, తన పేరుని బ్లాక్‌లిస్ట్‌లో చేరుస్తారనే భయంతోనూ అలా తిట్టకుండా అతి వినయం ప్రదర్శిస్తూ వుత్తరం రాసాడు.
ఉత్తరం రాసిన మూడో రోజు నించీ మళ్ళీ ఎదురు చూపులు!
చివరికి వుత్తరం రాసిన 98వ రోజున, ఒక దుర్ముహూర్తంలో పోస్ట్‌మేనే గోవిందరావుకి ఓక కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు.
కవరు విప్పి చూశాడు. అందులో వంద రూపాయలకి చెక్ వుంది.
గోవిందరావు మళ్ళీ మరోసారి మహదానందపడిపోయాడు.
వంద రూపాయిలు తను మేథాశక్తితో సంపాయించాడు!
కొద్దిసేపు ఉబ్బితబ్బిబ్బై వూహాలోకాల్లో విహరించిన గోవిందరావుకి ఆ చెక్‌ని క్యాష్‌గా ఎలా మార్చుకోవాలో అర్ధం కాలేదు.
గోవిందరావుకి జీవితంలో వచ్చిన మొదటి చెక్ అది.
వాళ్ళ ఇంటికి నాలుగు ఇళ్ళ ప్రక్కన మున్సబ్ గారి ఇల్లు వుంది.
మున్సబ్ కొడుకు ఏవో పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తుంటాడు. అతనికి బ్యాంకులతో కూడా ఎప్పుడూ లావాదేవీలు వుంటాయి.
పేపర్ చూడటం కోసం అనే వంకతో వాళ్ళ ఇంటికి వెళ్ళాడు గోవిందరావు.
అతను పట్నానికి ఫోన్ చేసి ఎవరితోనో మాట్లాడుతున్నాడు.
"ఏమోయ్, పని మీద వచ్చావు?" గోవిందరావుని చూసి పలకరించాడు.
"పేపర్ చూద్దామని వచ్చాను" గోవిందరావు అక్కడ వున్న బెంచి మీద చతికిలపడి పేపర్ తీసుకున్నాడు.
కొద్దిసేపు పేపర్ చూసినట్లు చూసి, జేబులో నుంచి చెక్ తీసి అతనికి చూపెట్టి అన్నాడు. "నేను కథ రాస్తే ఈ చెక్ పంపించారు బాబాయ్! దీన్ని ఎలా మార్చుకోవాలో తెలియదు!"
"అప్పుడే సంపాదనాపరుడివైపోయావన్నమాట! పైగా రచయితవి కూడా అయ్యావు!" అని ప్రశంసించాడు. తరువాత చెక్ తీసుకుని పరిశీలనగా చూశాడు.
"బేంకి దగ్గరికిపోయి ఎకౌంట్ ఓపెన్ చేసి చెక్ ఇస్తే వాళ్ళే మార్చి పెడతారు. ముందు ఎకౌంట్ ఓపెన్ చేయాలి!" అన్నాడాయన.
"ఎకౌంట్ ఓపెన్ చేయకపోతే డబ్బు ఇవ్వరా బాబాయ్?" అనుమానంగా అడిగాడు.
"ఇవ్వరు. డి.డి.కి అయితే ఓపెన్ చేయకపోయినా పర్లేదు కానీ, చెక్ కాబట్టి కంపల్సరీగా ఎకౌంట్ వుండాలి"
"రాగిమాతల యూనియన్ బ్యాంక్‌కి వెళ్ళి మార్చుకోవచ్చుగా?"
"ఓ.ఎస్. ఏ బ్యాంక్‌కైనా వెళ్ళొచ్చు. మనకి దగ్గిర కాబట్టి రాగిమాతల యూనియన్ బ్యాంక్‌కి వెళ్ళడమే మంచిది"
రాగిమాతల అంటే అక్కడికి 6 మైళ్ళ దూరంలో వుంది. అయితే డైరెక్ట్‌గా బస్ లేదు. రెండు బస్సులు మారాలి. ఆ బస్సులు సమయాన్ని పాటించవు. వాటి ఇష్టం.
సైకిల్ వేసుకుని వెళ్దామా అంటే ఎండలు చాలా ఎక్కువగా వున్నాయి. ఆ

ఎండల్లో ఆరు మైళ్ళు గతుకులదారిలో తొక్కడం ఇబ్బందే!

మరుసటి రోజు గోవిందరావు కొత్త బట్టలు వేసుకుని, రెండు బస్సులు మారి మధ్యాహ్నం 12 గంటలకి రాగినూతల చేరుకున్నాడు. యూనియన్ బ్యాంక్ దగ్గరికి వెళ్ళాడు.

లోపల జనం ఎక్కువగా లేరు. మేనేజర్ క్యాబిన్ ఖాళీగా వుంది. స్టాఫ్ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఎకౌంట్ ఓపెన్ చెయ్యాలండీ!" గోవిందరావు క్యాష్ కౌంటర్ దగ్గరికి వెళ్ళి లోపల కూర్చున్న వ్యక్తిని అడిగాడు.

అతను తల వంచుకుని డబ్బు లెక్కపెట్టుకుంటూ తల పైకెత్తి గోవిందరావు వైపు దోమనో, ఈగనో చూసినట్లు చూసి, మళ్ళీ లెక్కింపులో పడ్డాడు. ఏం జవాబు లేదు.

గోవిందరావు అక్కడే నిలబడి, కొద్దిసేపాగి మళ్ళీ అదే మాట అడిగాడు.

"ఏ వూరు మీది?" అతను నిర్లక్ష్యంగా ప్రశ్నించాడు.

"పమిడిపాడండీ!"

"అదిగో, అటు పోయి మాట్లాడు" అని అతను ఫీల్డ్ ఆఫీసర్ వైపు చూపెట్టాడు.

గోవిందరావు ఫీల్డ్ ఆఫీసర్ దగ్గరికి వెళ్ళి తను వచ్చిన పని చెప్పాడు.

"ఇవ్వాళ మేనేజర్ లేరండీ! కొత్త ఎకౌంట్స్ మేం ఓపెన్ చెయ్యం. మేనేజర్ రావాలి. రేపు . రండి"

"సేవింగ్స్ ఎకౌంటే కదండీ!" బ్రతిమలాడే ధోరణిలో అడిగాడు గోవిందరావు.

"అవును. సేవింగ్స్ ఎకౌంట్ అయినా కొత్తగా ఓపెన్ చెయ్యడం కదా? మా వల్ల కాదు. మేనేజర్ వుండాలి. మీరు రేపు రండి. రేపు ఆయన వుంటారు" అదే మాట మళ్ళీ చెప్పాడు.

"మాది పమిడిపాడండీ! రెండు బస్సులు మారి చాలా ప్రయాసపడి వచ్చాను. పాస్ బుక్కే గదా?" ఆ ఫీల్డ్ ఆఫీసర్ మనసు కరగకపోతుందా అనే వుద్దేశ్యంతో కొంత సేపు అక్కడే నిలబడిన తరువాత అడిగాడు.

"లాభం లేదండీ! మేనేజర్ వుండాల్సిందే!" అన్నాడు ఆయన నిక్కచ్చిగా.

గోవిందరావు వుసూరుమని నిట్టూర్చి మెట్లు దిగి బస్టాండు దారి పట్టాడు. ఇంటికి వచ్చేసరికి సాయంత్రం 4 గంటలైంది. పోయిన పని కాలేదూ, 12 రూపాయిల డబ్బూ ఖర్చైపోయింది.

బస్సుల కోసం ఎదురు చూసీ చూసీ అవి వచ్చినప్పుడు ఎక్కిపోవడం కంటే తన ఇష్టం వచ్చినప్పుడు పోవచ్చూ, రావచ్చూ దిక్కుమాలిన ఆర్టీసీ బస్సు మీద ఆధారపడటం అనవసరం, ఎండలు అయితే అయినయ్ అని మరుసటి రోజు సైకిల్ వేసుకుని రాగినూతల వెళ్ళాడు గోవిందరావు.

మేనేజర్ రూంలో మేనేజరూ, ఇంకా ముగ్గురు వ్యక్తులూ కూర్చుని వున్నారు. మేనేజర్ సంతకాలు చేస్తూనే, సిగరెట్ దమ్ము కొడుతూ వాళ్ళతో మాట్లాడుతున్నాడు.

గోవిందరావు ఆ అద్దాల గదిలోనికి వెళ్ళి, రెండు చేతులూ ఎత్తి అతి వినయంగా నమస్కరించాడు.

"ఏమిటి?" అన్నట్లు ఆయన కనుబొమ్మలు ఎగరేశాడు.


తనని తను పరిచయం చేసుకుని, వచ్చిన పని చెప్పాడు.

"నువ్వు గోవిందరావు అని మాకు గుర్తేమిటి?" మేనేజర్ ప్రశ్నించాడు.

రచయిత గోవిందరావు గుడ్లు తేలేశాడు. "నేను నిజంగా గోవిందరావునే నండీ!"

"నిజమే! నేను నమ్ముతా! కానీ బ్యాంకులు నమ్మవుగా! నువ్వు ఎకౌంట్ ఓపెన్ చేయాలంటే, నువ్వు తెల్సిన వాళ్ళు ఎవరైనా మా బ్యాంకులో ఖాతా వున్న వాళ్ళు ఇంట్రడ్యూస్ చేస్తూ సంతకం చెయ్యాలి!"

తమ వూరి వాళ్ళు ఎవరైనా వున్నారా అని బ్యాంకులో చూశాడు. ఎవరూ లేరు.




"ఎవరూ లేరు కద సార్!" దీనంగా అడిగాడు.

"ఏం చేద్దాం? ఎవరైనా వస్తారేమో వెయిట్ చెయ్, లేకపోతే రేపు ఎవర్నయినా తీసుకురా! "

మళ్ళీ మరుసటి రోజు రావడం కంటే తమ వూరి వాళ్ళు ఎవరైనా బ్యాంకు దగ్గరికి రాకపోతారా అని రెండు గంటల వరకూ ఎదురు చూశాడు. ఎవరూ రాలేదు.

"మా వూరి వాళ్ళు ఎవరూ రాలేదు సార్! మళ్ళీ ఇంత చిన్న పని కోసం రేపు ఎక్కడ రాను? నిన్న కూడా వచ్చానండీ! సేవింగ్స్ ఎకౌంట్ ఎంత పనండీ!" దీనంగా ముఖంలో పోజు పెట్టి బతిమలాడుతూ అన్నాడు.

"నిజమే, ఏం చేయమంటావు చెప్పు? రూల్స్ రూల్సే కదా! రేపు ఎవర్నో మీ వూరి వాళ్ళని తీసుకురా! పది నిమిషాల్లో పని అయిపోతుంది!"

"పది నిమిషాల్లో పని అయినా నేను రోజంతా పని మానుకుని రావాల్సిందే కద సార్! ఇది దొంగ చెక్కు ఏం కాదు గదా? దొంగ చెక్కుని మారుస్తుంటే మీరు అభ్యంతరం పెట్టడం ధర్మమే!"

"భలేవాడివయ్యా నువ్వు! నీ ముక్కూ ముఖం మాకు తెలియదు. వచ్చీ రావడంతోనే ఎకౌంట్ ఓపెన్ చేయమంటే కుదురుతుందా? అంత తేలిక అనుకుంటున్నావా ఏమిటి? ఇదేం ఆషామాషీ విషయం కాదు, ఇది బ్యాంక్! కొన్ని రూల్స్, రెగ్యులేషన్స్ వుంటాయి"

"తెలుస్తూనే వుంది!" గొణుక్కున్నట్లుగా అన్నాడు గోవిందరావు ఆయనకి వినపడకుండా.

గోవిందరావు నిరసననీ, ముఖంలో ఫీలింగ్‌నీ గమనించిన మేనేజర్ సీరియస్‌గా అన్నాడు. "అసలు దొంగ చెక్కులు మార్చేదేమిటి? దొంగ చెక్కులు మార్చాలని చూస్తే ఇక్కడ ఉండవు! ఈ పాటికి లాకప్‌లో కటకటాలు లెక్కపెట్టుకుంటూ వుంటావు!"

గోవిందరావు మారు మాట్లాడకుండా బయటకు వచ్చాడు.

విసుగుపుట్టింది. జేబులోని చెక్‌ని చింపి పారేద్దామనిపించింది.

జంతర్‌మంతర్ వాళ్ళు ఎం.ఓ. చేసినా బాగుండేది కదా అనుకున్నాడు.


ఇక చేసేది ఏం లేక సైకిల్ ఎక్కాడు.

బ్యాంకులో ఖాతా వున్న వాళ్ళు వూళ్ళో ఎవరైనా వున్నారా అని ఆలోచించాడు. మదిలో నారాయణ స్ఫురించాడు.

ఆయనకి పాతిక ఎకరాలు బంగారం లాంటి భూమి వుంది. ఆయన మామూలు మొండివాడు కాదు, జగమొండి!

ఆయనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిసినార్ల సంఘానికి అధ్యక్షుడుగా ఎలాంటి అభ్యంతరం లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకోవచ్చు. ఆ పదవికి ఆయన

తప్పకుండా న్యాయం చేకూర్చడమే కాదు, వన్నె కూడా తీసుకొస్తాడు.
తక్కువ స్థాయి నించి పైసా పైసా కూడబెట్టి సంపాయించినవాడు!
ఆయన జీవితంలో చొక్కా తొడుక్కుని ఎరుగడు. చెప్పలంటే ఏమిటో తెలియదు.
ఎంత దూరవు వూరు వెళ్ళినా వంటి మీద ఆరు మూరల కండువా వేసుకుని, చొక్కా లేకుండా వెళ్ళాల్సిందే!
ఆయన చిరుతిళ్ళుగా ముగ్గురాళ్ళని ఇష్టంగా తింటుంటాడు. వాటికి పైసా ఖర్చు లేదు కదా!
పిల్లలు లేరు ఆయనకి, బ్యాంకుల్లో 14, 15 లక్షలపై చిలుకు డబ్బు మూలుగుతోందని వూళ్ళో జనం అంటూంటారు. అయితే ఎంత వుందో ఎవరికీ స్పష్టంగా తెలియదు. ఆయన గుట్టు వరమావవుడికి కూడా వెల్లడి చేయడు.
అయితే వాళ్ళ ఇంటికి బ్యాంకుల వాళ్ళు మాత్రం కార్లు వేసుకుని వస్తుంటారు. ఊళ్ళో పలుకుబడీ, గౌరవం బొత్తిగా లేకపోయినా బ్యాంకుల దగ్గర మాత్రం బోల్డంత పలుకుబడీ, గౌరవం వుంది.
గోవిందరావు వాళ్ళ పొలం ప్రక్కనే ఆయనకి కూడా కొంత పొలం వుంది. అప్పుడప్పుడూ పొలం దగ్గర కూర్చుని వాళ్ళ తాతలనాటి పురాణం ఏదో





చెపుతుంటాడు.
నారాయణని బ్యాంకు దగ్గరికి తీసుకుపోతే బాగుంటుందనుకున్నాడు గోవిందరావు.
సూర్యుడు చండప్రచండంగా పంజా విసిరాడు. రాళ్ళు కూడా బద్దలయ్యే రోహిణి కార్తె ఎండలు చెండుకు తింటున్నాయి. మిట్టమధ్యాహ్నం వడ గాలులు తీక్షణంగా వీస్తున్న ఎండాకాలవు ఆ ఎండల్లో రొప్పుకుంటూ, చెమటలు కక్కుకుంటూ, సైకిలు తొక్కుకుంటూ దారిలో ఒక చెట్టు క్రింద కూర్చుని కొంత సేపు సేద తీర్చుకుని మొత్తానికి సాయంత్రం 4 గంటలకి ఇంటికి చేరుకున్నాడు.
చీకటి పడిన తరువాత నారాయణ వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. ఆయన ఇంట్లోనే వున్నాడు.
"ఏందిరోయ్ అల్లుడూ! ఎప్పుడు రానోడివి ఇటు పడి వచ్చావేంది?" బయట వాకిట్లోనే గోవిందరావుని పలకరించాడు.
"నీతో పని పడింది మామా!"
"నాతోనా? నాతో ఏం పనిరా?"
"నువ్వు రాగిమాతల యూనియన్ బ్యాంకి దగ్గరికి రావాలి మామా!"
"ఏందుకూ?"
"బేంకిలో పాస్ బుక్ కావాల్సి వచ్చింది మామా! పాస్‌బుక్ కొత్తగా కావాలంటే తెల్సిన వాళ్ళు ఎవరైనా సంతకం పెట్టాలంట!"
"నాకు బేంకిలో తెల్సిన వాళ్ళు ఎవరూ లేర్రా! పైపెచ్చు నాకు రావడానికి కూడా వల్లకాదు"
"మనకి బేంకి వాళ్ళు తెలియడం ఏముంది? బ్యాంకిలో డబ్బులుంటే చాలు, అందరూ తెల్సినట్లే!"
"నాకు ఆ బేంకిలో డబ్బులు కూడా లేవు కదరా!"
"అట్ట అనమాకు మామా! తథాస్తు దేవతలుంటారంట! మనకు లేవు అంటే నిజంగానే లేకుండా చేస్తారు. పాస్‌బుక్ కోసమేలే మామా నీ సంతకం!"
"మాకు బరిగొడ్లు దగ్గిర ఎవురూ లేర్రా అబ్బాయి. నేను రేపు బరిగొడ్లు దగ్గర వుండాలి! వాటిని మేవుకోవాలి కదా? బుడ్డ జీతగాడు ఎగ్గొట్టిపోయాడు!"
"ఎంత సేపు మామా? బస్సులో ఎక్కిపోయి, మళ్ళీ బస్సు ఎక్కి రావడమే! ఎంతసేపట్లో వస్తాం? బరిగొడ్లకి ఒక మేత వేసి, అవి ఆ మేత తినేలోపే తిరిగి రావచ్చు! "
"అబ్బ! నువ్వు పట్టుకుంటే వదిలిపెట్టేలా లేవు కదరా? సరే, రేప్పొద్దున కనపడు ఏ వైనమూ చెవుతా! నా మీద మాత్రం గట్టిగా నమ్మకం పెట్టుకోమాకురేయ్! నాకు వల్లనయితే వస్తా, లేకపోతే లేదు. ముందే చెవుతున్నా!"
"వల్లయ్యేదేముందిలే మామా! గట్టిగా రావాలి!" అని గోవిందరావు ఇంటికి వెళ్ళిపోయాడు.
మరునటి రోజు ఉదయం 8 గంటల సమయంలో వాళ్ళ ఇంటికి మళ్ళీ వెళ్ళాడు గోవిందరావు.
"గట్టిగా రావాల్సిందేనంట్రా?" అడిగాడు.
"రా మామా! ఎంత సేపూ, తొందరగా పోయి తొందరగా వద్దాం!"
"సరే, పోదాం కానియి అయితే!" అని ఆయన పెట్టెలో నించి ఆరు మూరల కొత్త కండువా తీసుకుని భుజాన వేసుకుని బయల్దేరాడు.
"చింత చెట్టు దగ్గర వుండు,ఇంటికి పోయి వస్తా!" అని గోవిందరావు ఇంటికి వచ్చాడు.
ప్యాంటు వేసుకుని, 75 రూపాయిలు డబ్బులు వుంటే అవి తీసుకుని చింతచెట్టు దగ్గరికి వెళ్ళాడు.
ఆ వూరి మీదుగా వెళ్ళే బస్సు చింత చెట్టు దగ్గరే ఆగుతుంది. చింతచెట్టు బస్టాండు అన్నమాట!
ఇంటి దగ్గర పెందలాడే బయల్దేరడంతో 11 గంటల సమయానికి బ్యాంకు దగ్గరికి చేరుకున్నారు ఇద్దరూ.
లోనికివెళ్ళిన తరువాత వీళ్ళని చూసి "రండి నారాయణగారూ...రండి రండి..కూర్చోండి" అని ఆయనని సాదరంగా ఆహ్వానించాడు మేనేజర్.
నారాయణ వెంట తోకలా అనుసరించి ఆయన ప్రక్కన బెంచి మీద కూర్చున్నాడు గోవిందరావు.
అప్పటికే ఆ బెంచి మీద ముగ్గురు రైతులు ఇరుక్కుని కూర్చుని వున్నారు.
"చెప్పండి. ఏమిటి విశేషాలూ? బాగున్నారా? ఈ మధ్య బ్యాంకు వైపు రావడం తగ్గించేశారు?" నారాయణని ప్రశ్నించాడు మేనేజరు.
"విశేషాలు ఏముంటయ్యండీ! మా వోడి పేరుతోటి పుస్తకం కావాలంటండీ!" నారాయణ అన్నాడు.
"పుస్తకమా?" ఆశ్చర్యపోయి, గోవిందరావు వైపు చూసి గుర్తు తెచ్చుకుని "నిన్న వచ్చారు కదా మీరు?" ప్రశ్నించాడు మేనేజర్.
"అవును" అని గోవిందరావు మళ్ళీ తనని తను పరిచయం చేసుకుని, చెక్ చూపెట్టాడు.
"ఎట్టోకట్ట ఇయ్యేటికియ్యండి లోన్లు. ఇయ్యేదు కానీ మీరు లోన్లు ఇస్తే

గట్టున పడతాం. మమ్మల్ని బతికించిన వాళ్ళు అవుతారు! పంటలు వచ్చిన వెంటనే లోన్లు కడతాం!" బెంచి మీద కూర్చున్న వాళ్ళలో ఒక రైతు ప్రాధేయపడుతున్నట్లుగా మేనేజర్‌ని అడిగాడు.
"లాభం లేదండీ, లోన్లు ఇవ్వడం లేదని చెప్పా కదా!"
"కాదనవాకండీ!" మరో రైతు అన్నాడు.
"మీరు ఒక పని చేయండి. 50 వేలు తీసుకు వచ్చి మా బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయండి. ఇయ్యేడు 8వేల లోను ఇచ్చే మార్గం చేస్తాను!"
"మా దగ్గిర 50 వేలు వుంటే మీ బేంకి దగ్గరికి రావాల్సిన కర్మ మాకెందుకు పట్టిద్దండీ? మాకే డబ్బులు వుంటే ఇంక మీరు లోన్ ఇచ్చేది ఏముంది?" ఒక రైతు గట్టిగానే అన్నాడు.
"మరేం చేద్దాం? మీరు డబ్బులు బ్యాంకులో వేయకుంటే మేం లోన్లు ఎక్కడ నించి తెచ్చి ఇస్తాం? మీ డబ్బులే కదా తిరిగి మేం మీకు లోన్లు ఇచ్చేది! ఇయ్యేడు మీ పంటల్లో వచ్చిన ఆదాయం మా బ్యాంకులో వేయండి. వచ్చే ఏడు లోను ఇస్తాం!"
"వచ్చే ఏడు విషయం ఇప్పుడు ఎందుకులెండి? ఇయ్యేటి విషయం చెప్పండి!"
"కుదరదండీ! కొత్త లోన్లు మాత్రం ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరికైనా కొత్త లోన్లు ఇస్తున్నామంటే వాళ్ళకి మా బ్యాంకిలో డిపాజిట్లు వున్నాయన్న మాట! డిపాజిట్ వున్న వాళ్ళకే లోన్లు ఇస్తున్నాం కొత్తవి!"
"డబ్బులు వున్న వాళ్ళకే లోన్లు ఇచ్చే పనయితే ఎందుకండీ మీ బ్యాంకులు ఇంక?" అంటూ ఆ రైతులు మేనేజర్ మాటలకి కోపగించుకుని వెనక్కి తిరిగి చూడకుండా గోచీలు బిగించి పెద్ద పెద్ద అంగలు వేస్తూ వెళ్ళిపోయారు.
"వీళ్ళకి ఒక్కొక్కరికి లక్ష రూపాయలకి తగ్గకుండా వుంటయ్యండీ డబ్బులు! ఆ డబ్బులు బయట పెద్ద వడ్డీలకి తిప్పుకుంటారూ, బంగారాలు కొనుక్కుంటారూ, ఇళ్ళు బ్రహ్మాండంగా రిపేర్లు చేయించుకుంటారూ! వాళ్ళ డబ్బు మాత్రం వాళ్ళ దగ్గరే వుండాలి. అది కదలించకూడదు. బ్యాంకులో తక్కువ వడ్డీ కావటంతో పరిగెత్తుకొని లోన్లు ఇవ్వమని వస్తారు. వాళ్ళకి వున్న డబ్బు మా బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తే లోన్లు ఇవ్వకపోయామా?" అన్నాడు మేనేజర్ నారాయణ వైపు తిరిగి.
"చెప్పండి...మీ విషయం ఏమిటన్నారూ?" అన్నాడు మళ్ళీ.
"మా వోడికి పుస్తకం కావాలంటండీ!"
"ఓహో..మరచిపోయాను" అని కాలింగ్‌బెల్ నొక్కి అటెండర్‌ని పిలిచి చెప్పాడు.
"ఈయన ఎకౌంట్ ఓపెన్ చేస్తారట. అప్లికేషన్ ఫారాలు తీసుకురా!"
అటెండర్ ఫారాలు తెచ్చి ఇచ్చాడు.
మేనేజర్ స్వయంగా ఆ ఫారాలు పూర్తి చేసి "ఇక్కడ సంతకం పెట్టండి" అని గోవిందరావుకి ఇచ్చాడు.
గోవిందరావు మొత్తం 4 సంతకాలు పెట్టాడు.
నారాయణరావుతో కూడా వేలిముద్ర వేయించాడు.
"వంద రూపాయిలు ఇవ్వండి" అని ఆ ఫారాలు అటెండర్ చేతికి ఇచ్చాడు మేనేజర్.
కౌంటర్‌లో క్యాష్ కట్టడానికి అటెండర్ గోవిందరావు ఎదురుకి వచ్చాడు డబ్బు కోసం.
"వంద రూపాయిలు లేవండీ! 50 రూపాయిలే వున్నయ్యి. 50 రూపాయిలతో ఓపెన్ చేయండి" గోవిందరావు అన్నాడు.
"న్యూ ఎకౌంట్ ఓపెన్ చేయాలంటే మినిమం వంద రూపాయిలు వుండాలండీ! 50 రూపాయిలతో ఎకౌంట్ ఓపెన్ చేయడం కుదరదు" మేనేజర్ సీరియస్‌గా అన్నాడు.
గోవిందరావు కొంచెం ఫీలైతలదించుకున్నాడు. తను వాలుగేళ్ళ క్రితం ఏదో అవసరం పడి పది రూపాయిలతోనే బ్యాంక్‌లో ఎకౌంట్ తెరిచాడు. ఇప్పుడు కూడా 10 రూపాయిలతోనే ఎకౌంట్ ఓపెన్ చేయొచ్చు అనుకున్నాడు గోవిందరావు. అయినా బ్యాంకులో వుండేవే కదా అనీ, గొప్పగా వుంటుందనీ కూడా తను 50 రూపాయిలతో ఎకౌంట్ తెరుద్దామని 50 రూపాయిలూ, ఖర్చులకి 25 రూపాయిలూ తెచ్చుకున్నాడు.
కేవలం పాస్‌బుక్‌కే వంద రూపాయిలంటే, ఆ బ్యాంకు మీద అప్పుడే బాంబు పడినంత ఆశ్చర్యపోయాడు అతను.
"ఆహా, బ్యాంకులూ ప్రభుత్వమూ బాగానే ప్రజలకి సేవ చేస్తున్నాయి" అని బ్యాంకు మేనేజర్ దగ్గర్నించీ గవర్నమెంటు దాకా మనసులో తిట్టుకున్నాడు.
"ఏందిరా, ఎట్టచేద్దాం? నేను కూడా బొడ్లో రూపాయి పెట్టుకుని రాలా!" అన్నాడు నారాయణ.
గోవిందరావుకి ఏం చేయాలో తోచలేదు. వాళ్ళ వూరి వాళ్ళు ఎవరూ లేరు.
"ఎట్ట చేయమంటారు సార్?" మేనేజర్‌ని దీనంగా అడిగాడు.
"చేసేదేముంది? నారాయణగారి సంతకం కూడా తీసుకున్నాం కదా! ఈ ఫారాలు నేను జాగ్రత్త చేస్తాను. రేపు వంద రూపాయిలు తీసుకురండి" అన్నాడు మేనేజర్.
"ఎట్ట మామా?"
"ఎట్ట ఏముందిరా? ఇక్కడ ఇప్పుడు మనకి 50 రూపాయిలు ఎవురు




ఇస్తారూ, ఎక్కడ్నించి వస్తయ్యి? మళ్ళీ రేపురా నువ్వు" తేలిగ్గా అన్నాడు నారాయణ.
"ఏం నారాయణ గారూ...ఏటా ఒక లక్ష రూపాయిలైనా తీసుకువచ్చి బ్యాంకులో వేసేవాళ్ళు. ఇయ్యేడు ఇంతవరకూ ఇటు వైపు రాలేదు"
"ఇంకా పంటలు అమ్మలేదీ! పత్తీ, అపరాలు అట్నే ఇంట్లో వున్నయ్యి! అమ్ముదామని చూస్తుంటే వాటి ధరలు వావాటికీ తీసికట్టూ, వాగంభట్టూ అన్నట్టు ఇంకా తగ్గుతున్నయ్యే కానీ పెరగడం లేదు"
"అవి అమ్మిన తరువాత మన బేంకిని మరిచిపోకండి. మీలాంటి వాళ్ళు మా వైపు చూస్తుంటేనే మాకూ కొంత సంతోషంగా వుంటుంది" అన్నాడు మేనేజర్.
"ఇప్పుడు ఏం చేద్దామబ్బాయి?" నారాయణ అడిగాడు గోవిందరావుని
"ఏదైనా నువ్వే చేయాలి మామా! 50 రూపాయిలు సర్దితే ఇంటికి పోయిన తరువాత ఇయ్యవాంట?"
"నా దగ్గిర ఎందుకు వున్నయ్యిరా డబ్బులు? వుంటే ఇంత సేపా, ఇందాకనే ఇయ్యకపొయ్యామా?"
"బేంకిలో అయినా తీసుకోవచ్చు కద మామా?"




"బలేవోడివిరా! యాబయి రూపాయిలు ఏం తీసుకుంటా బేంకిలో?"
"మరి ఇంక ఏం చేద్దాం? మనవూరి వాళ్ళు కూడా ఎవరూ రాకపోయా! ఇంటికి పోదాం పద!" అని నిరాశగా లేచాడు గోవిందరావు.
ఇద్దరూ కలసి బస్టాండు దగ్గరికి వచ్చారు.
"కాఫీ తాగుదామనిపిస్తందిరా" అన్నాడు నారాయణ బస్టాండులో.
గోవిందరావు ఆయనని అక్కడే వున్న చిన్న హోటల్‌కి తీసుకుపోయాడు.
"ఏం తీసుకుంటారూ?" లోపల బీడీ తాగుతూ కూర్చున్న సర్వర్ కమ్ ప్రొప్రయిటర్ వీళ్ళని ప్రశ్నించాడు, లోనికెళ్ళిన తరువాత.
"ఏమున్నయ్యి తింటానికి?"
ఆయన లిస్ట్ చదివాడు.
"తీసకరా నీకెందుకు మిరపకాయబజ్జీలూ, గారెలూ, వులి బొంగరాలు!" అని నారాయణ బకాసరుడికి మల్లే తిండి కార్యక్రమానికి వుపక్రమించి విజృంభించాడు.
గోవిందరావు డబ్బుతో నారాయణ కడుపు నిండా తిని బ్రేవ్‌మని త్రేన్చాడు.
బయటకు వచ్చిన తరువాత కిళ్ళీ బంకు దగ్గర నిలబడ్డారు బస్సు కోసం.
"వక్కసూర తిని శానా రోజులవతందిరా! వక్కసూర తినాలనపిస్తంది" అన్నాడు.
గోవిందరావు వక్కపొడి ప్యాకెట్ కొని తెచ్చాడు.
"సిగరెట్ తాగితే ఎట్టుంటదిద్దిరా?" ప్రశ్నించాడు నారాయణ.
"ఏమో, నాకేం తెలుసు? నేనేమైనా తాగేవోడ్నా, పెట్టేవాడ్నా?"
"సరే నీకెందుకు తీసుకో ఒక సిగరెట్టు"
"లోకుల సొమ్ము అయితే విషం అయినా తాగేటట్లు వున్నావు కదరా ముసిలోడా!" అని గోవిందరావు తిట్టుకుంటూ నారాయణకి సిగరెట్ ఒకటి కొనిపెట్టాడు.
ఆయనకి బ్యాంకుల్లోనూ, ఇతరత్రా వున్న డబ్బుకి కనీసం లక్ష రూపాయిల వడ్డీ వస్తుంది. పొలం పంటల్లో ఖర్చులు పోగా లక్ష రూపాయిల కంటే ఎక్కువే మిగులుతుంది. ఎంత తక్కువగా అనుకున్నా ఆయనకి సంవత్సరానికి 2 లక్షల రూపాయిల నికరాదాయం అన్నమాట.
పిల్లలు లేరు. పైగా పైసా ఖర్చు లేదు.
ఆయనకి ఏడాదికి వచ్చే ఆదాయం అంత ఆస్తి లేదు గోవిందరావుకి.
ఇద్దరూ రెండు బస్సులు మారి ఇంటికి వచ్చారు. గోవిందరావు ఇంటి దగ్గర లెక్క చూసుకుంటే ఛార్జిలు, టిఫినూ కలిపి 42 రూపాయిల ఖర్చు అయింది.

"అమ్మోనాయనో..కనపడకుండానే చాలా కర్చయ్యిందే! ముసిలోడు బాగానే కర్చు పెట్టించాడు. నిజానికి ముసిలోడు తన కోసం కాదు వచ్చింది. బాగా మెక్కడానికే తన వెంట వచ్చాడు. తనకి కర్చయితే అయింది, పోయిన పని కూడా కాకపోయా! మళ్ళీ రేవు వెళ్ళాల్సిందే!" అనుకున్నాడు గోవిందరావు.
మరునటి రోజు వుదయం మూట పది రూపాయిల డబ్బు జేబులో వేసుకుని ఎండలో వడదెబ్బ తగిలితే తగిలిందని సైకిల్ ఎక్కి పెందలాడే రాగినూతల బ్యాంక్‌కి వెళ్ళాడు.
10 గంటలైంది. తలుపులు తీశారు.
మేనేజర్ పేపర్‌లోని షేర్ కొటేషన్స్ దీర్ఘంగా చూస్తున్నాడు. గోవిందరావు ఆయన రూంలోనికి వెళ్ళబోతుంటే, "అక్కడ కూర్చోండి" అని లోపలికి రావదనే వుద్దేశంతో బయటవున్న బల్ల చూపెట్టాడు.
స్టాఫ్ ఒక్కొక్కరే వస్తున్నారు. మేనేజర్ రూంలోనికి వెళ్ళి విష్ చేసి "తమిళనాడు గ్యాస్ ఎంతుంది సార్ రేటు?" అడిగాడు ఒకాయన.
"బీసార్ స్పాంజ్" మరొకరూ,
"గుజరాత్ అంబుజా" వేరొకరూ,
"ఒరిస్సా ఆర్గానిక్స్" ఇంకొకరూ,
"ఆంధ్రా సుగర్స్" తరువాత వచ్చిన ఆయనా,
"కేరళ ఆయుర్వేదిక్" తరువాత...
"రాజస్తాన్ పాలిమర్స్"
ఇలా ఒక్కొక్కరే వచ్చి వాళ్ళకి వున్న షేర్స్ ఎంతకి కోట్ అయ్యాయో కనుక్కున్నారు. కొంత మంది సంతోషంగానూ, కొంత మంది కాస్తంత విచారంగానూ ఒక్క క్షణం పోజులు ఇచ్చారు.
ఇంతలో తెల్లప్యాంటూ, తెల్లచొక్కా వేసుకుని ఇన్‌షర్ట్ చేసి స్టయిల్‌గా వున్న ఒకతను మేనేజర్ రూంలోనికి వెళ్ళి విష్ చేశాడు. అతను బ్యాంకు క్యాషియరే! అతను లోనికి అడుగుపెడుతూనే "ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, పంజాబ్ బ్యాంక్, రాజస్తాన్ బ్యాంక్, వైశ్యాబ్యాంక్, లక్ష్మీ విలాస్ బ్యాంక్, గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ ఎంతకి కోట్ అయ్యాయి సార్?" అని ప్రశ్నించాడు.
అతను ఎంత స్పీడ్‌గా ప్రశ్నించాడో, అంతే స్పీడ్‌తో మేనేజర్ చూడకుండానే టకటకా వాటి ధరలు చెప్పాడు.
అంతే. అతను క్షణంలోనే భోరుమని పెద్దగా ఏడవటం మొదలుపెట్టాడు.
"ఏమైంది, ఏమైంది?" అని ఒకరు అడిగారు.
"అయ్యో పాపం! రెండు నిమిషాల క్రితం బాగానే వున్నాడు కదండీ! ఇంతలోనే ఏమైంది? ఎక్కడ నొప్పి నాయనా?" ప్రశ్నించారు మరొకరు.
"పాపం, కడుపునొప్పి కాబోలు! ఎడమవైపా, కుడివైపా? ఎపెండిసైటిస్ ఏమైనా అయి వుంటుందంటారా? ఎపెండిస్ అయితే ప్రమాదమే సుమా! 24 గంటల్లో ఆపరేషన్ చేయకపోతే మనం ఆశలు వదులుకోవాల్సిందే! తొంద రగా టౌనుకి తీసుకుపోయి ఆపరేషన్ చేయించకపోతే రేపో, ఎల్లుండో మనం సంతాపసభ ఏర్పాటు చేసి సెలవు తీసుకోవాలి!"
"అవునూ, సంతాపసభకి ఎవర్ని ఇన్‌వైట్ చేద్దాం? రీజియనల్ మేనేజర్ అయితే బావుంటుందా? లేకపోతే..."
"నిక్షేపంగా చెట్టంత మనిషిని ఎదురుగా వుంటే, చావకుండానే పాడె కట్టే సారేమిటయ్యా మీరు? అప్పుడే సంతాపసభకి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు!"
"అయితే కడుపునొప్పి కాదా? మరెందుకు ఏడుస్తున్నట్లూ!"
"నాకేమయ్యా, నేను బాగానే వున్నాను. పాపం, మా మామయ్యే..." అంటూ మళ్ళీ భోరుమని విలపించాడు.
"అయ్యో పాపం! మీ మామయ్య పోయారన్నమాట! ఎంత దుర్వార్త! నిన్ననే కదండీ ఆయన దగ్గర్నుంచి మీకు వుత్తరం వచ్చింది. ఇంతలోనే ఎందుకు పోయినట్లూ?"
"క్యాన్సర్ కాబోలు! ఈ మధ్య జనాలకి క్యాన్సర్ జబ్బు రావడం ఎక్కువై

పోయింది! క్యాన్సర్‌కి మందులు కూడా కనుక్కున్నారంట కదండీ! ఇవ్వాళ క్యాన్సర్ అంత ప్రమాదకరమైన జబ్బు కాదంటున్నారే!"

"క్యాన్సర్ కాదు, ఎయిడ్స్ అయి వుంటుంది! ఎయిడ్స్‌కి మందుల్లేవు కదా?"

"సైన్స్ ఇంత డెవలప్ అయినా ఎయిడ్స్‌కి మందులు లేకపోవటం ఎంత విచారకరం!" ఇంకా మీ మామయ్య లాంటి వాళ్ళు ఎంత మంది ఎయిడ్స్ వాతపడాలో!"

"హయ్యో! అరవై ఏళ్ళ మనిషికి ఎయిడ్స్ ఎందుకు వస్తుందయ్యా?" ఒకవైపు ఏడుస్తూనే ప్రశ్నించాడు క్యాషియర్.

"ఎయిడ్స్ కాదా? మరెందుకు పోయినట్లు? ఏం జబ్బు చెప్మా!"

"ఆయన పోయారని మీతో ఎవరన్నారండీ?"

"అరె..అయితే పోలేదన్నమాట! శుభవార్తే! మరెందుకు మామయ్యా అని తలుచుకుని కుమిలికుమిలి ఏడుస్తున్నారు?"

"ఎందుకా? చెబితే ఈ దుఃఖం తీరేది కాదు సార్! మామయ్యా...మామయ్యా" అంటూ ఆయన మళ్ళీ ఏడుపుకి లేచాడు.

"ఊరుకో...ఊరుకో...మాకు కూడా చెబితే కడుపులోని బాధ కొంత తగ్గుతుంది. ఏం పర్లేదు చెప్పు!" అని మేనేజర్ సముదాయించాడు.

"చెప్పమంటారా?"

"చెప్ప, పర్లేదు"

"డిగ్రీ పూర్తయిన తరువాత ఐదేళ్ళు వూరికే తిరిగాను. అప్పుడు పెళ్ళాన్ని పోషించుకోవడం కూడా నాకు కష్టమైంది. అలాంటి పరిస్థితిలో నాకు వుద్యోగం రావడంతో అందరితో పాటే మా మామయ్య కూడా ఎగిరి గంతేశాడు. ఎప్పటికైనా నువ్వు మన్మోహన్‌సింగ్ అంతటి వాడివి అవుతావురా అంటుండేవాడు. మా మామయ్య వాక్కు నిజమై నేను నిజంగా అంతటి వాడిని అయినట్లు ఫీలయ్యాను. అలాంటి సమయంలోనే షేర్ జ్వరాలు మామూలు జనాలకి కూడా విషజ్వరాల్లా వ్యాపించాయి. మూడో నాటికే మిలయనీర్స్ కావచ్చని అందరితో పాటే నేనూ, మా మామయ్యా కూడా నమ్మాం"

"మంచి పని చేశారు,అయితే?"

"మా మామయ్య గడ్డి గాదమూ తినీ, జనాలను మోసం చేసీ, టోపీలు పెట్టీ సంపాయించిన మూడు లక్షలతో పాటు దొరికిన చోటల్లా అప్పులు చేసి మరో రెండు లక్షలు తెచ్చి ఇచ్చి మాంచి షేర్స్ చూసి కొని పెట్టు అల్లుడూ అని నాదోసిట్లో పోశాడు"

"మరి మంచివి చూసి కొనిపెట్టకపోయారా?"

"అలాగే చేశాను. అన్ని పేపర్లూ, కేపిటల్ మ్యాగజైన్స్ అన్నీ తిరగేసి ఐదు లక్షలకి ఏకంగా షేర్లు కొన్నాను. నేను కొనడమే ఆలస్యం, మరుసటి రోజు నుంచి అవి అన్నీ తగ్గిందే తగ్గడం తప్ప పెరిగిన పాపాన పోలేదు"

"అరె, ఎందుకు జరుగుతున్నట్లు అలాగా?" మేనేజర్ ప్రశ్నించాడు ఆశ్చర్యంగా

"ఎందుకేమిటి సార్, మీరే చెప్తున్నారు కదా రోజుకో కారణం, నెలకో కారణం! ఏడాది క్రితం సెయింట్ కిట్స్‌లో పి.వి. ప్రమేయం వున్నట్లు వార్తలు రావడంతో షేర్ల ధరలు తగ్గుముఖం పట్టాయి అన్నారు!"

"నిజమే!"

"తరువాత చక్కెర కుంభకోణం చేదు తగలడంతో అవి మరీ దిగజారిపోయాయి అన్నారు!"

"అదీ నిజమే!"

"తరువాత టెలిస్కాం రింగ్ కావడంతో ఇవి ఇంకా పడిపోయాయి అన్నారు"

"ఆల్ రైట్, అదీ నిజమే కదా?"

"విదేశీ పీడ ఏమిటని ఎన్‌రాన్ రద్దు చేయడంతో సెన్సెక్స్ పతనోన్ముఖంగా పయనిస్తోందని అన్నారు తరువాత"

"అదీ కరెక్టే కదా?"

"తరువాత వచ్చిన హవాలా దెబ్బకి దేశంతో పాటు మా షేర్లు కూడా దివాలా ఎత్తాయి! "

"అరె..."

"ఒకటా, అరా కారణాలు సార్? మన్‌మోహన్ సింగ్‌కి తలనొప్పి అంటే సెన్సెక్స్ డౌన్ అయిపోతుందే! పి.వి.కి బి.పి.డౌన్ అంటే ఆయన బి.పి.కంటే ఇక్కడ సెన్సెక్స్ డౌనయిపోతుందే! ఎప్పుడూ తగ్గడం తగ్గడం తప్ప పెరిగేది ఎప్పుడు సార్?"

"ఎప్పుడో ఒకప్పుడు పెరక్కపోతుంది అంటావా?"

"ఏం పెరగడం సార్? మన మంత్రులు రోజుకో స్కాం, రోజుకో కుంభకోణం సృష్టిస్తున్నారు. అందుకోసమే కాచుకుని వుండే గోతికాడనక్కల్లాంటి మన బ్రోకర్లు షేర్ల ధరలు డౌన్ చేసి వదిలిపెడుతున్నారు!"

"అవునయ్యా! మన మంత్రులు వాళ్ళ బుద్ధులు మార్చుకోనంత కాలం ఈ షేర్ల ధరలు పెరగవూ, ఈ దేశమూ బాగుపడదు!"

"ఎలుక తోలు తెచ్చి ఎందాక వుతికినా నలుపు నలుపే కాని తెలుపు రాదయ్యా..." అంటూ ఆయన ఏడుపు ఆపేసి రాగయుక్తంగా పద్యాలకి లేచాడు.

"వూరుకోవయ్యా, వూరుకో! ఇదేమైనా స్టేజీనా పద్యాలు పాట్టానికి? ప్రక్కన కష్టమర్లు వున్నారు. వాళ్ళు ఎగతాళి చేస్తారు!" అన్నాడు మేనేజర్.

కష్టమర్లని అలాగే కూర్చోపెట్టి, వాళ్ళు ముప్పావుగంటసేపు షేర్స్ గురించీ, లాభనష్టాల గురించీ చర్చించుకున్నారు. జోకులు వేసుకున్నారు. నవ్వుకున్నారు. తరువాత నెమ్మదిగా వాళ్ళ సీట్స్‌లోకి వచ్చి చేరగిలపడ్డారు.

ఒక స్త్రీ, ఇద్దరు మగవాళ్ళు మేనేజర్ రూం లోనికివెళ్ళారు. గోవిందరావు కూడా మెల్లగా వాళ్ళవెంట లోనికి వెళ్ళాడు.


"బంగారం పెట్టుకుని లోన్ ఇవ్వాలండీ!" అడిగాడు వాళ్ళలో ఒక రైతు. అతను ఇస్త్రీ పంచె కట్టి, చదువుకున్న వాడి మాదిరిగా వున్నాడు.


"లోన్ ఎందుకూ?"

"ఎగసాయానికి. సత్తువ మందు ధరలు పెరిగిపోయినయ్యి! పురుగు మందుల ధరలు పెరిగిపోయినయ్యి! ఎగసాయానికి ఇయ్యేడు పెట్టుబడి చాలా ఆయ్యేటట్టుగా వుంది. ముందుగానే సత్తువలూ, మందులూ కొని పెట్టుకుందామని" మరో రైతు అన్నాడు.

"వ్యవసాయ ఋణాలు ఇవ్వడం లేదండీ!"

"ఎట్టండీ? మొన్న మా వూరి ఎంగయ్యకి ఇచ్చారంట కదా?"






"అగ్రికల్చర్ పేరుతో లోన్లు ఇవ్వడం లేదు. నాన్ అగ్రికల్చర్ లోన్లు అయితే ఇస్తాం. వడ్డీ మాత్రం ఎక్కువ అవుతుంది."

"అదేమిటీ? మేం వ్యవసాయానికి రుణం అడిగితే, మీరు వ్యవసాయేతర రుణం ఇస్తామంటే ఎలా? మేం ఆ వడ్డీ భరించొద్దంటండీ?" చదువుకున్న రైతు అన్నాడు.

"అంతే నండీ! వ్యవసాయ రుణాలు ఇవ్వడానికి మాకు పై నుంచి ఆర్డర్స్ లేవు. వాళ్ళ నించి ఆర్డర్స్ వుంటే ఇవ్వగలం కానీ, మేం స్వంతంగా ఇవ్వలేము!"

"మొన్న మా వూరి వ్యాపారి శేషయ్యకి బంగారం పెట్టుకుని 40 వేలు అగ్రికల్చర్ లోను ఇచ్చారంట కదండీ! ఆయనే చెప్పాడు. నిజానికి ఆయన వ్యాపారం కోసం తెచ్చుకున్నాడు ఆ లోను!"

"నిజమేనండీ! అప్పుడు ఇవ్వడానికి ఆర్డర్స్ వున్నాయి, ఇప్పుడు లేవు. మీకు స్వంతంగా కావాలనుకుంటే నాన్ అగ్రికల్చర్ లోను తీసుకోవచ్చు కదా?"

"ఆ లోనుకి వడ్డ ఎంత అవుతుంది?"

"ట్వంటీ టూ పర్సెంట్ అవుతుంది!"

"వ్యవసాయ రుణం అయితే?"

"దానికి పన్నెండు శాతం"

"ఈ ఒక్కసారికి ఇయ్యండి వ్యవసాయ రుణం, బంగారం పెట్టుకునే!"

"కుదరదు. ఎందుకు అనవసరం మాటలు!"

"అదేందీ, యేపారస్తులకి ఎగసాయం కోసమని చెప్పి తక్కువ వడ్డీకి అప్పు ఇయ్యడం ఏందీ, రైతుల దగ్గర ఎక్కువ వడ్డీ తీసుకోవడం ఏందీ?" అని గొణుక్కుంటూ, వాళ్ళు బయటకు వచ్చారు, ఏం చేయాలా అనే విషయం మాట్లాడుకోవటానికి.

గోవిందరావు వైపు తిరిగి, "వంద రూపాయిలూ, ఫొటోలు తెచ్చారా?" అడిగాడు మేనేజర్.

"ఫొటోలు ఏమిటి?" ఆశ్చర్యగా అడిగాడు గోవిందరావు

"నిన్న చెప్పాము కదా, ఫొటోలు కూడా కావాలని!"

"ఫొటోలు కావాలని ఎప్పుడు చెప్పారండి? వంద రూపాయిలు తెచ్చుకోమన్నారు. అంతే కదా!" దిగ్భ్రాంతితో కొంచెం అసహనంగా అన్నాడు.

"భలే వాళ్ళండీ. ఫొటోలు లేకుండా ఎకౌంట్ ఎలా ఓపెన్ చేస్తాం? కంపల్సరీగా ప్రతి వ్యక్తికీ ఫొటోలు వుండాల్సిందే! అది రూల్. నేను నిన్న చెప్పా కదా ఫొటోలు అవసరం అనీ..." దబాయిస్తూ అన్నాడు మేనేజర్.

గోవిందరావుకి తారాస్థాయిలో కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు.

"నిన్న మీరు ఫొటోలు తీసుకురమ్మని చెప్పారా?" అణిచిపెట్టుకోవాలనుకున్నా ఆగని కోపంతో, సూటిగా అడిగాడు.

"నిన్న చెప్పలేదా? చెప్పి వుంటానే...సారీ, ఒక వేళ మాటల్లో పడి మరిచిపోయానేమో! ఇప్పుడు చెపుతున్నాను కదా, వెళ్ళి ఫొటోలు తీయించుకుని రండి" తాపీగా అన్నాడు.

"మనం ఇవ్వాళ ఫొటోలు తీయించుకుంటే ఇవ్వాళే కాపీలు ఇస్తారా?"

"ఏమో, ఎప్పుడు ఇస్తారో ఎవరికి తెలుసు అవన్నీ? వెళ్ళి ఫొటోలు తీసుకురండి, లేకుంటే లేదు" మేనేజర్ నిర్మొహమాటంగా అన్నాడు.

ఇక చేసేది లేక గోవిందరావు దగ్గర్లోనే స్టూడియో వుంటే అక్కడికి వెళ్ళాడు. అతను 24 గంటల తరువాత ఫొటోలు ఇస్తానన్నాడు.

"సరే, అలాగే తీయండి" అని గోవిందరావు ఫొటోలు తీయించుకున్నాడు. మళ్ళీ బ్యాంకు దగ్గరికి వచ్చి ఆ విషయం మేనేజర్‌కి చెప్పాడు.

"రేపు రండి. తప్పకుండా పనవుతుంది. ఇప్పటికే రెండు సార్లు తిరిగేరులా వుంది"

"రెండు సార్లు ఏమిటండీ, ఇవ్వాళ ఆరోసారి రావడం..."

"రేపు రండి. మీ చెక్ మార్చి పెడతాం. రేపు ఫొటోలు ఇస్తానన్నాడు కదా?"

"ఇస్తానన్నాడు" మనసులో విసుగ్గా, కోపంగా, చిరాగ్గా వున్నా అవి వెల్లడి కానివ్వకుండా మామూలుగానే బయటకు వచ్చాడు గోవిందరావు. "దొంగ గాడిద కొడకా..." అని మనసులో కసితీరా తిట్టుకుంటూ...

తను కథ రాసిన ఉత్సాహం, అది ప్రచురణ జరిగాక పొందిన ఆనందం అన్నీ మటుమాయమయ్యాయి.

తను ముందు ముందు గొప్ప రచయిత కావడం ఖాయం! అప్పుడు బోలెడు చెక్కులు వస్తాయి. కనుక ఎప్పటికైనా బ్యాంక్ పాస్‌బుక్ వుంటే మంచిదనే ఉద్దేశంతోనే, గోవిందరావు ఆ మండే మే నెల ఎండల్లో ఆరు రోజుల పాటు బ్యాంకు చుట్టూ తిరిగాడు.

రచయిత కావడం సంగతి దేవుడెరుగు, పత్రిక వాళ్ళు పంపిన ఒక్క చెక్ మార్చుకోవడానికే తనకి తాతలు దిగి వచ్చారు. ఆ బ్యాంకు చుట్టూ తిరిగినందుకూ, అక్కడ హోటళ్ళలో మెక్కినందుకూ లెక్క చూస్తే ఆ చెక్ మొత్తం ఎంతో అంతకంటే ఎక్కువే ఖర్చయ్యింది. పైగా అన్ని రోజుల పాటు పని మానుకుని గంగిరెద్దులా ఆ బ్యాంక్ చుట్టూ తిరగడం!

విసుగుపుట్టిన గోవిందరావు రెండు రోజులు ఆ బ్యాంకు ఛాయలకే వెళ్ళలేదు. చివరికి సోమవారం అయిష్టంగానే "ఇవ్వాళ ఏం వంక పెడతాడో" అని అనుమానంగానే రాగిమాతల వెళ్ళాడు.

ముందుగా స్టూడియో దగ్గరికి వెళ్ళాడు. ఫొటోగ్రాఫర్ వెంటనే తన ఫొటోలు ఇచ్చాడు.

అవి తీసుకుని బ్యాంకు దగ్గరికి వెళ్ళాడు. మేనేజర్ క్యాబిన్ ఖాళీగా, బోసిగా వుంది.

"ఈ స్టాఫ్ తన పని చేసి పెడతారో, మళ్ళీ తిప్పించుకుంటారో..." అని జంకుతూ, జంకుతూనే ఫీల్డ్ ఆఫీసర్ దగ్గరికి వెళ్ళాడు.

నిజానికి అవసరం లేకపోయినా, తనని తాను మళ్ళీ పరిచయం చేసుకుని వృత్తాంతమంతా వివరించాడు.

"మేనేజర్ లేరు కదండీ! మీ ఫారాలు ఆయన డెస్క్‌లో వుండి వుంటాయి. మేనేజర్ గారు డ్వాక్రా లోన్ల విషయం మాట్లాడడానికి మేదరమెట్ల మండల ఆఫీసుకి వెళ్ళారు. రేపు రండి" శాంతంగా అన్నాడు ఫీల్డ్ ఆఫీసర్.

"రేపు వచ్చేదేమిటి? మాకు ఇక వేరే పని లేదనుకుంటున్నారా? ఎన్నిసార్లు తిప్పించుకుంటారు మీ చుట్టూ? వూరికి వెళ్ళే మేనేజర్ ఆ ఫారాలు మీకుఇచ్చే పని లేదా?" కోపంగా, బ్యాంకు పై కప్పు లేచిపోయేలా అన్నాడు

గోవిందరావు.

నిజానికి గోవిందరావు చాలా శాంతస్వభావుడు. బ్యాంకు వాళ్ళ సేవలలో అంతటి శాంతస్వభావుడికే అవధుల్లేని కోపం వచ్చేసింది.

"ఎవర్ని అడుగుతారు మీరు? మా కోసం తిరుగుతున్నారా ఏమిటి బ్యాంకు చుట్టూ? మీ అవసరం కోసం తిరుగుతున్నారు. మమ్మల్ని దబాయిస్తే ఏం ప్రయోజనం? రేపు మేనేజర్ వస్తారు. ఆయన్ని అడగండి"

"దేనికైనా విలువ వుండాలండీ! వెధవ పాస్‌బుక్...ఐదు నిమిషాల్లో చేసే పని. పది రోజుల్నించీ రేపు మాపు అని తిప్పించుకుంటున్నారు. వచ్చేటప్పుడూ, పోయేటప్పుడూ నేను రెండు బస్సుల కోసం ఎదురు చూసి, రోజు రోజంతా ఎంత ఇబ్బంది పడుతున్నానో ఏమన్నా తెలుసా మీకు? ఎందుకండీ బ్యాంకులూ, హర్షద్ మెహతా లాంటి వాళ్ళకి సేవలు చేయడానికా?" కోపంగా అడిగాడు.

"మీరు మాతో మాట్లాడటం అనవసరమండీ! మేనేజర్‌తో మాట్లాడండి. అంతే కానీ, మమ్మల్ని దబాయిస్తారేమిటి? అసలు మీరు ఎవరు?" చాలా నిర్లక్ష్యంగా, ఏహ్యాభావంతో, విదిలించికొట్టినట్లుగా అన్నాడు ఫీల్డ్ ఆఫీసర్.

గోవిందరావు ఇక మాట్లాడకుండా బయటికి వచ్చి సైకిల్ ఎక్కాడు.

విపరీతంగా ఎండ కాస్తోంది. హోరుమని చెవులు చిల్లులు పడేలా వడగాలి వీస్తోంది.

ఈ ఎండలో, గాలిలో తను ఆరు మైళ్ళు తొక్కగలనా అని సందేహపడ్డాడు. మళ్ళీ 'తప్పేదేముంది' అనుకున్నాడు.

రెండు మైళ్ళు వచ్చిన తరువాత ఎండకి వుండలేక చెట్టు క్రిందికి వెళ్ళాడు. గంటసేపు చెట్టు కింద కూర్చున్నాడు. నీడగా వుంది కానీ, ముఖం పగిలిపోయేలా వడగాలి!

చివరికి సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాడు.

మరుసటి రోజు ఉదయం సైకిల్ వేసుకుని రాగిమాతల ప్రయాణమయ్యాడు. ఈ రోజు కొట్టడమో, కొట్టించుకుని రావడమో, తాడో పేడో తేల్చుకోవాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు.

మేనేజర్ వున్నాడు. సిగరెట్ దమ్ము కొడుతూ షేర్ కొటేషన్స్ చూసు కుంటున్నాడు. ప్రతి రోజూ ఆయనకి అది నిత్య కార్యక్రమం మాదిరిగా వుంది.

గోవిందరావు ఆయన క్యాబిన్ లోనికి వెళ్ళి విష్ చేశాడు.

ఆయన తలెత్తి చూసి "ఏమిటి?" అన్నట్లు నొసలు చిట్లించాడు.

"ఎకౌంట్ ఓపెన్ చేయడానికి వచ్చాను. నాలుగు రోజుల క్రితం వస్తే ఫోటోలు తీసుకురమ్మన్నారు. నిన్న వచ్చాను. మీరు లేరు"

"మీరు నిన్న ఏమిటేమిటో మాట్లాడారట కదా! మేం అసలు మీ ఎకౌంట్ ఓపెన్ చెయ్యం. ఏం చేస్తారు మీరు?"

"ఎందుకు చేయరు?"

"మా ఇష్టం. చెయ్యం. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి!"

"మిమ్మల్ని ప్రశ్నించేవాడు ఎవడూ లేడు. అందుకే మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. బ్యాంకు అంటే నీ బాబుగాడి సొమ్ము అనుకుంటున్నా వేమో! ఇది నీ బాబు సొంత ముల్లె కాదు! ఇలా వుంటే మీరు జనంతో తొందరగానే తన్నులు తింటారు. అలాంటి పరిస్థితి, అదే, జనంతో తన్నులు తినే పరిస్థితి మాత్రం తెచ్చుకోకండి! జనానికి త్వరగా కోపం రాదు, వచ్చిందంటే పిచ్చి కుక్కని...తెలుసు కదా పిచ్చికుక్క...ఆ కుక్కని కొట్టినట్లు చావకొట్టి వదిలిపెడతారు!" నెమ్మదిగానే చాలా స్పష్టంగా, దృఢస్వరంతో అన్నాడు.


"ఏ...ఏ...ఏమిటండీ మీరు మాట్లాడేది?" మేనేజర్ భయంతో వణికిపోతూ అన్నాడు.

"నోర్ముయ్యమంటున్నాను. ఐదు నిమిషాల పనికి 15 రోజుల్నించీ రకరకాల వంకలు పెట్టి తిప్పించుకున్నావు! చివరికి ఎకౌంట్ ఓపెన్ చెయ్యం అంటున్నావు! నా వెంట్రుకా సరే, నీ ఎకౌంటూ సరే!" అని గోవిందరావు జేబులోనించి చెక్ తీసి, దాన్ని పరపరా చరచరా ముక్కలు ముక్కలుగా చింపి, విసిరి మేనేజర్ ముఖం మీదకి చల్లి, విసురుగా బ్యాంకు నుంచి బయటకు వచ్చాడు.

ఆ బ్యాంకులోని స్టాఫంతా మిడిగుడ్లు వేసుకుని భయపడుతూ గోవిందరా వువైపు చూశారు.

* * * * *

# నేను ఆమె



స్తంభించిన సముద్రంలా ఆమె
దీర్ఘ నిద్రలో మౌనముద్ర
కనురెప్పలపై ఓ చెమట బిందువు
చంద్రుడు చినబోయాడు
దగదగలాడే ఆమె ముఖ వర్చస్సు
గుడ్డి వెలుగు దీపించింది
కిటికీలో తళుక్కుమన్న చుక్క
ఏకాంతంలో నేను
జరజరా నడిచి పోతున్న మబ్బు తునక
తేలిపోతున్న రాలిన పండుటాకు
నివురుగప్పిన ప్రశాంతత
కదలాడని చీమ
వస్తున్న ఈదర గాలిలో తడబాటు
తరగలు తరగలుగా పిల్ల తెమ్మెర
కరెంటు వైరుపై పావురాయి
టేబుల్‌పై కాలం సంకలనం
కవిత్వమై పలకరింపు
మనస్సు శృంఖల ఫటేల్లున విరిగిన చప్పుడు
ఆలోచనా ధార తెగింది
నేను ఆపాద మస్తకం
పుస్తకాన్నయ్యాను
ప్రపంచం నన్నొదిలేసింది
అక్షరాలు నా మీంచి జలజల నడిచిపోయాయి
నవ్విన నిమీలిత నేత్రాల నక్షత్రం
నన్ను ముద్దాడి నిష్క్రమించింది
ఆమె నుదుటే సూర్యోదయమయ్యింది
దీర్ఘ నిద్రలో నేను
మౌన ముద్రలో ఆమె

— ఎస్. జగన్